



పిటిసిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నిలువనీడ లేదాయే..!

◆ పెనుకొండలో నడిరోడ్డుపై ప్రయాణికుల నిరీక్షణ..!
◆ డివిజన్, నియోజకవర్గ కేంద్రంలో బస్ షెల్టర్లు కరువు
◆ పూలు, పండ్ల దుకాణాల నీడే దిక్కు
◆ రోడ్డు పక్కన ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-పెనుకొండ

నియోజకవర్గ కేంద్రం, చారిత్రక పట్టణంలో ప్రయాణికులకు నిలువనీడలేదు. బస్సులు రాక కోసం నిరీక్షించే వారికి నీడ కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నచిన్న మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం బస్సు షెల్టర్లు ఉండగా, పెనుకొండ పట్టణంలో లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులకు గురి చేస్తోంది. రాకపోకలు సాగించే వారు బస్సు షెల్టర్లు కరువై పండ్లు, పూల దుకాణాలు, టీ కొట్లు వద్ద నిరీక్షించాల్సిన దుస్థి నెలకొంది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఎండ, వానకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.


అంబేద్కర్ సర్కిల్లో బస్సు కోసం రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు

డివిజన్ కేంద్రంలో బస్ షెల్టర్లు కరువు

పెనుకొండ నియోజకవర్గ కేంద్రమే కాదు.. డివిజన్ కేంద్రం కూడా. ఇక్కడ బస్ షెల్టర్లు లేకపోవడం ఆశ్చర్యం కలిగించే అంశమే. బస్సు వచ్చేంత వరకు నడిరోడ్డుపై పడిగాపులు కాయాల్సిందే. పెనుకొండలో బస్టాండు మినహా మిగితా బస్సులు ఆపే ఏ చోట కూడా బస్‌షెల్టర్లు లేవు. ముఖ్యంగా అంబేద్కర్ సర్కిల్‌లో వివిధ గ్రామాలు, పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో అక్కడ బస్సుల కోసం వేచి ఉంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడ ప్రయాణికుల రద్దీ ఉంటుంది. అలాంటి ప్రాంతంలో ప్రయాణికులకు నిలువ నీడ లేదు. ఇక్కడి నుంచి అనంతపురం, ధర్మవరం, పుట్టపర్తి, బుక్కపట్నం, మడకశిర, రొద్దం, పావగడ, హిందూపురం, బెంగళూరు తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంబేద్కర్ కూడలిలో ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు, ఆటోలు, జీపులు ప్రయాణికులను ఎక్కించుకుంటారు. ఇంత రద్దీగా ఉండే ప్రాంతంలో కనీసం ఒక్క బస్‌షెల్టర్ కూడా లేదు. నిత్యం వందలాది మంది ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు రాకపోకలు సాగించే ప్రాంతంలో నిలువనీడ లేకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పండ్లు, పూల దుకాణాల సంచినీడే దిక్కు..

అంబేద్కర్ సర్కిల్లో బస్సులు, ఆటోల కోసం రోడ్డుపైన వేచి ఉండే ప్రయాణికులు ఎండ, వానకు తట్టుకోలేక అక్కడ ఉన్న పండ్లు, పూల దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకుని సంచి నీడ కింద తలదాచుకుంటున్నారు. దుకాణాల ముందు ఎక్కువ సేపు నిలబడితే తమ వ్యాపారాలు జరగడం లేదంటూ వ్యాపారులు విసుక్కుంటున్నారు.

రోడ్డు పక్కన ఎదురుచూపు

పెనుకొండ, సమీప ప్రాంతాల నుంచి వైద్య చికిత్సల నిమిత్తం వికలాంగులు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు, గర్భిణులు పుట్టపర్తి, అనంతపురం, బత్తలపల్లి ఆసుపత్రులకు వెళ్తుంటారు. ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా వీరందరూ అంబేద్కర్ సర్కిల్లో వేచి ఉండాల్సిందే. అలాంటి ప్రాంతంలో కనీసం కూర్చోనేందుకు బల్లలు లేకపోవడంతో వీరంతా అసౌకర్యానికి గురవుతున్నారు.


బస్సుల కోసం ఎదురు చూస్తూ ఎండవేడిమిక రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు

బల్లలు ఏర్పాటు చేసిన సవిత

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఈ ప్రాంతంలో అక్కడక్కడ సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవి మాత్రమే ప్రయాణికులకు ఉపయోగపడుతున్నాయి. ఇవి కూడా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఉండడం లేదు. అంబేద్కర్ సర్కిల్‌లో నిల్చోవడానికి నీడలేకపోవడంతో ఆర్‌బ్ల్యూఎస్, తహశీల్దార్ కార్యాలయాల ఆవరణలో బస్సులు వచ్చేవరకు వేచి ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి పెనుకొండ అంబేద్కర్ సర్కిల్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి

చారిత్రక నేపథ్యం కలిగిన పెనుకొండలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధుల పరిస్థితి మరి దారుణంగా ఉంటోంది. దూరంగా ఉన్న చెట్ల కింద వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి బస్సుషెల్టర్లను ఏర్పాటు చేయాలి.

కదిరప్ప, ప్రయాణికుడు.

నేడు జిల్లా స్థాయి యోగాంధ్ర

◆ పిటిసిలో ఏర్పాట్లు పూర్తి ◆ అందరూ పాల్గొనాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం శనివారం నాడు జిల్లా వ్యాప్తంగా జరగనుంది. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని అనంతపురం పిటిసి మైదానంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతపురం పిటిసిలో 5 వేల మంది పాల్గొనేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 6,002 కేంద్రాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా యోగాంధ్రలో పాల్గొనేందుకు 10.88లక్షల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని వీరంతా శనివారం ఉదయం ఆయా ప్రాంతాల్లో పాల్గొనాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎ.మాలోల, ఆర్డీవో కేశవ నాయుడు, డిఎంహెచ్‌ఒ డా॥ఈబి.దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందని కుల ధ్రువీకరణ పత్రాలు

తహశీల్దార్‌లేక విద్యార్థులకు అవస్థలు

ప్రజాశక్తి-యల్లనూరు

విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఇంటర్మీడియట్ విద్యార్థులు కళాశాలల్లో చేరారు. ఆయా కళాశాలల్లో చేరే సమయంలో వీరికి కులధ్రువీకరణ పత్రాలు అవసరం అవుతున్నాయి. వీటిని మంజూరు చేయాల్సిందిగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే యల్లనూరు మండలానికి తహశీల్దార్ లేకపోవడంతో ఈ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దరఖాస్తు చేసుకుని నెల రోజులు అవుతున్నా ఇవి విద్యార్థులకు అందడం లేదు. డిప్యూటీ తహశీల్దార్‌కైనా వీటిని మంజూరు చేసే బాధ్యతలు అప్పగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

15 రోజుల క్రితం దరఖాస్తు

రియాజ్, దరఖాస్తుదారుడు

తన కుమారుడు ఇంటర్ కళాశాలలో చేర్చే నిమిత్తం అవసరమైన కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని 15 రోజుల క్రితం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. ఇంత వరకు మంజూరు కాలేదు. దీనిని ఎప్పుడిస్తారంటే తహశీల్దార్ కార్యాలయంలో కనీస సమాచారం ఇచ్చే వారు కూడా లేదు.

సోలార్‌కు 'సాగు భూములివ్వం..!

అధికారులకు తెగేసి చెప్పిన బొమ్మేపర్తి రైతులు

ప్రజాశక్తి-రాప్తాడు

'తాతల కాలం నుంచి ఈ భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం.. అలాంటి భూములను ఎంఎస్‌ఎంఇ పార్కుల కోసం బలవంతంగా లాక్కోవాలని చూస్తే సహించం.. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదు.' అంటూ రాప్తాడు మండలం బొమ్మేపర్తి, గొందిరెడ్డిపల్లి గ్రామ రైతులు అధికారులకు తెగేసి చెప్పారు. ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటు పేరుతో రాప్తాడు మండలం బొమ్మేపర్తి, గొందిరెడ్డి పల్లి గ్రామాల్లో భూములను తీసుకునేందుకు అధికారులు సర్వే చేశారు. దీనిని ముందు నుంచి ఆ గ్రామ రైతులు వ్యతిరేకిస్తున్నారు. భూమలిచ్చేందుకు తమకు ఇష్టం లేదంటూ సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే పలుమార్లు తహశీల్దార్, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా అధికారులు పదేపదే వస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం గ్రామానికి వచ్చిన ఆర్‌ఐ,


భూములు ఇవ్వమని రెవెన్యూ అధికారులు చెబుతున్న బొమ్మేపర్తి పంచాయతీ రైతులు

విఆర్వోలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి పోతలయ్య మాట్లాడుతూ బొమ్మేపర్తి రెవెన్యూ పొలంలో 27 మంది రైతులకు 120 ఎకరాలను 60 సంవత్సరాల క్రితం ప్రభుత్వం మంజూరు చేసి పట్టాలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం భూములు ఇచ్చిన స్థలంలో అందులో పెద్దపెద్ద గుట్టలు, రాళ్లు ఉండగా రైతులు సాగు కోసం వాటిని ఎంతో శ్రమ, ఆర్థిక పరిస్థితులకు ఓర్చి సాగులోకి తెచ్చుకున్నారని తెలిపారు. ఒక్కో రైతు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారన్నారు. అందులో బోర్లు వేసుకుని పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇప్పుడు ఆ భూములను పరిశ్రమ పేరుతో లాగేసుకుంటే రైతులు రోడ్డున పడుతారన్నారు. రైతులు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేకున్నా బొమ్మపర్తి పొలంలోని 307 సర్వేనెంబర్‌లో ఉన్న 114 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించడానికి తహశీల్దార్ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా భూములు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని భూముల జోళికి రావొద్దని తెలియజేశారు. బలవంతంగా భూములు తీసుకోవాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ముత్యాలప్ప, వన్నూరప్ప, నిర్మల, మౌనిక, పార్వతమ్మ, ఎల్లమ్మ, మల్లికార్జున పాల్గొన్నారు.

హుస్సేన్ సేవలు ఆదర్శం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేదలు, కష్టజీవుల పక్షాన నిలబడి రాజీవ్‌కాలనీ అభివృద్ధికి మాజీ సర్పంచి డి.హుస్సేన్ అందించిన సేవలు ఎనలేనివని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలియజేశారు. గుంటూరు జిల్లా నరసరావుపేట వద్ద గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన హుస్సేన్ కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు శుక్రవారం పరామర్శించారు. రాజీవ్‌కాలనీలోని ఆయన నివాసం వద్ద హుస్సేన్ పార్థివదేహంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ హుస్సేన్ స్వతహాగా కమ్యూనిస్టు నాయకుడన్నారు. రాజీవ్ కాలనీ సర్పంచిగా ఆయన రెండు పర్యాయాలు, ఆయన భార్య రెండు సార్లు సర్పంచులుగా పనిచేశారంటే హుస్సేన్ ఎంత ప్రజాభిమానం పొందారో తెలుసుకోవచ్చన్నారు. కమ్యూనిస్టు భావాలతో పేదలు, కష్టజీవుల పక్షాన నిలబడ్డారన్నారు. పేదల కోసం అనేక ప్రాంతాల్లో గుడిసెలు వేయించి, వారికి ఇళ్ల పట్టాలు ఇప్పించారన్నారు. రాజీవ్‌కాలనీ అభివృద్ధిలో హుస్సేన్ పాత్ర మరువలేనిదన్నారు. హుస్సేన్ ఆశయాలను తాము కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, సిఐటియు నాయకులు వెంకట్ నారాయణ, మసూద్, డేవిడ్ వెంకటప్ప, వలి, నూరుల్లా, ప్రకాష్ రెడ్డి, ఫ్రిడ్జ్ రాజు, రామంజి, రాము, శ్రీనివాసులు, బాషా పాల్గొన్నారు.

అనంత వెంకటరామిరెడ్డి నివాళి

వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హుస్సేన్ పార్థివదేహానికి నివాళు అర్పించారు. రోడ్డు ప్రమాదంలో ఆయన


హుస్సేన్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న రాంభూపాల్, సిపిఎం నాయకులు

మరణించడం తీవ్ర బాధాకరం అని తెలియజేశారు. హుస్సేన్ సతీమణి, రాజీవ్‌కాలనీ సర్పంచి ఆశాబీతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం నింపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

మైన్స్, జియాలజీ అధికారికి సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెన్నా పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు అనుబంధం పెన్నా పరీవాహక పరిరక్షణ పోరాట రక్షణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మైన్స్, జియాలజీ అధికారి ఆదినారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి.ఓబులు మాట్లాడుతూ పెన్నా పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు అధికమయ్యాయని తెలిపారు. ముఖ్యంగా శింగనమల, గార్లదిన్నె, పెద్దవడుగూరు, మండలాల పరిధిలో రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, గోపురాజుపల్లి, చిట్టూరు, చిత్రచేడు, నాగలాపురం, కల్లుమడి, ఇల్లూరు, గ్రామాల మీదగా ప్రవహిస్తున్న పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఇసుక రవాణా అరికట్టకపోతే రైతుల పొలాల్లో బోర్లు ఎండిపోయి నీటి ఎద్దడితో వేలాది ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిపిపిపిఆర్ నాయకులు తరిమెల నాగరాజు, దండు విజయ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


మైన్స్, జియాలజీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

నామినేషన్లు వేస్తే అంతు చూస్తా..

వైసిపి నాయకులకు ఎమ్మెల్యే గుమ్మనూరు హెచ్చరిక

ప్రజాశక్తి-గుత్తి

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి నాయకులు ఎక్కడైనా నామినేషన్లు వేస్తే అంతు చూస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సంస్థాగత ఎన్నికలకు సంబంధించి దరఖాస్తులను ఎమ్మెల్యేతోపాటు ఎన్నికల పరిశీలకులు స్వీకరించారు. ఈ సందర్భంగా టిడిపి గుత్తి, పామిడి మండలాల ఇన్చార్జి గుమ్మనూరు ఈశ్వర్, గుత్తి పట్టణ కన్వీనర్ ఎంకె చౌదరి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన నియోజకవర్గంలో ఎక్కడా వైసిపి నాయకులపై కేసులు పెట్టలేదన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు కూడా కొంతమంది కుళ్లు, కుతంత్రాల రాజకీయ మాటలు వినకుండా కలిసి మెలిసి పని చేసి అన్ని సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు స్థానాలను కైవాసం చేసుకుందామని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో నన్ను రౌడీ, గుండా, కూనీకోరు అని అసత్య ప్రచారం చేశారన్నారు. అయినా ఇక్కడి ప్రజలు ఆదరించారన్నారు.అయినా తాను అందరిని ప్రేమించే వాడిని అన్నారు. అయితే వచ్చే సర్పంచి, ఎంపిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో ఏ వైసిపి నాయకుడూ నామినేషన్ వేయకుండా చూసుకుందామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపు ప్రతి వైసిపి నాయకుడు టిడిపికి జేజేలు కొడితే సరి.. లేదంటే తోక కత్తిరించి సున్నం పెట్టే రోజు వస్తుందన్నారు. అలాకాకుండా ప్రవర్తిస్తే నారా లోకేష్ రెడ్‌బుక్ క్లోజ్ చేసినా తాను మాత్రం స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ఓపెన్ చేస్తాన్నారు. అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచి, ఎంపీటీసీలను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

'అనంతసిరి' మహిళా కో ఆపరేటివ్ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-రాప్తాడు

మండల కేంద్రంలో మహిళా సంఘాలు ఏర్పాటు చేసుకున్న అనంతసిరి మహిళా కో ఆపరేటివ్ బ్యాంకు శుక్రవారం ప్రారంభించారు. రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల్లోని 23 గ్రామాలు, 77 మహిళా సంఘాలు, 2818 మంది మహిళలు కలిసి 15 మంది బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఏర్పడి రూ.51,93,600 మొత్తంతో అనతసిరి మహిళా కోఆపరేటివ్ బ్యాంకును ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్డీటీ విమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాలాఫెర్రర్, డీఎస్పీ వెంకటేసులు మాట్లాడుతూ ఆర్డీటీ ద్వారా చైతన్యం పొందిన మహిళలు స్వయంగా బ్యాంకు ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం సైబార్ నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో శక్తి యాప్‌పై మహిళలు అవగాహన పొందాలన్నారు. మహిళా బ్యాంకు అభివృద్ధి కోసం కురుగుంట గ్రామ ప్రజలు, లీడర్లు ప్రింటింగ్ మెటీరియల్ కోసం రూ.87100, యర్రగుంట గ్రామ ప్రజలు, లీడర్లు సాంకేతిక పరికరాల కోసం రూ.62000, గొందిరెడ్డిపల్లి నుంచి బీరువా, రాక్స్, టేబుల్స్, కుర్చీల కోసం రూ.75,000, బ్యాంకు అభివృద్ధి కోసం మూడు గ్రామాల నుంచి రూ.2,24,100 నగదును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం చార్టెడ్ అకౌంటెంట్ రష్మి, ఆర్‌వైడిటి డైరెక్టర్ నిరంజన్, కెనరా బ్యాంకు ఆఫీసర్ వెంకటకృష్ణ, బుక్కరాయసముద్రం ఆర్‌డి లక్ష్మణ్‌రావు, ఆర్‌ఇ జ్యోతి, రాప్తాడు ఏరియా కోర్డినేటర్ మల్లికార్జున, అనిత, తదితరులు పాల్గొన్నారు.


పత్రాలను అందజేస్తున్న అతిథులు

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా షారోన్ సోనియా

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆత్మారామ్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా షారోన్ సోనియా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు వీరిద్దరికీ గురువారమే ఎఫ్‌ఎసి బాధ్యతలను అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నర్సింగ్ హోమ్ ఉత్తరం అందించారు. ఈ మేరకు శుక్రవారం వారివారి ఛాంబర్లలో బాధ్యతలు చేపట్టారు. కాగా పెద్దాసుపత్రిలో నెలకొన్న అంతర్గత సమస్యలపై ఆత్మారామ్‌తో కలెక్టర్ వినోద్‌కుమార్ సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ షారోన్ సోనియాకు పలువురు అభినందనలు తెలిపారు.


ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అభినందిస్తున్న సిబ్బంది

'ఆడుదాం ఆంధ్ర'పై విచారణ

యల్లనూరు : గత వైసిపి ప్రభుత్వంలో క్రీడారంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కిట్లపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా విజిలెన్స్ సిఐ శ్రీనివాసులు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కరుణసాగర్‌ను కలిసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆడుదాం ఆంధ్ర కిట్ల వివరాలతోపాటు మండలంలో ఎన్ని పాఠశాలలు, ఎంతమంది విద్యార్థులు ఉన్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ వాసుదేవరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న విజిలెన్స్ సిఐ శ్రీనివాసులు

పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పిల్లలతో కలిసి ఓ తల్లి అదృశ్యమైన ఘటన నగరంలోని ఆర్‌కె నగర్‌లో చోటు చేసుకుంది. త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాల మేరకు.. ఆర్‌కె నగర్‌కు చెందిన కొల్లా కిరణ్‌కుమార్ భార్య కొల్లా అమరవాదికి కొడుకు రిత్విక్ కుమార్, కూతురు పూజ ఉన్నారు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో భర్తతో గొడవపడిన అమరవాది పిల్లలతో కలిసి ఎవరికీ చెప్పకుండా బ్యాగ్ తీసుకుని ఆటోలో వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. వీరి ఆచూకీ తెలిస్తే త్రీటౌన్ సీఐ సెల్.. 94906 18679, ఎస్‌ఐ 93469 17115 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.


పిల్లలతో ఉన్న అమరవాది (పాతచిత్రం)

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడికి మాతృవియోగం


శకుంతలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులుకు మాతృవియోగం కలిగింది. వయోభారంతో ఆయన తల్లి శకుంతలమ్మ (82) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, వ్యకాసం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, కెవిపిఎస్ నాయకులు జగ్గలి రమేష్, రాముినాయక్, వై.శ్రీనివాసులు, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు రంగమ్మ, సీనియర్ నాయకులు తిమ్మప్ప, ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాసులు నివాసానికి వెళ్లి శకుంతలమ్మ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా వైసిపి నియోజకవర్గ నాయకులు ఎన్.గాదిలింగేశ్వరబాబు (చిన్న), మంజునాథరెడ్డి, సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'భూ అక్రమార్కులకు మంచిబుద్ధి ప్రసాదించు తల్లీ'..


'ముసలమ్మ'ను వేడుకున్న బుక్కరాయసముద్రంవాసులు


మాట్లాడుతున్న బుక్కరాయసముద్రం గ్రామస్తులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం శివారులో వెలసిన ముసలమ్మ ఆలయానికి సంబంధించిన భూములను తప్పుడు పత్రాలతో ఆక్రమించేందుకు యత్నిస్తున్న అక్రమార్కులకు మంచిబుద్ధి ప్రసాదించు ముసలమ్మ తల్లి అంటూ గ్రామస్తులు, భక్తులు వేడుకున్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అశోక్ కుమార్, రామకృష్ణ, పొడరాళ్ల రవీంద్ర మాట్లాడుతూ 400 ఏళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయ స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలతో కాజేయాలని చూడటం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా భక్తులంతా ఐకమత్యమై ఉమ్మడిగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ముసలమ్మ తల్లి స్థలాలను ఆక్రమిస్తే పుట్టగతులు ఉండవన్నారు. ఇది ఏ ఒక్కరి కోసమో పోరాటం కాదని ముసలమ్మ తల్లి బుక్కరాయసముద్రం గ్రామస్తుల కోసమేనని స్పష్టం చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సుశీలమ్మ, సూర్యనారాయణరెడ్డి, గ్రామస్తులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, నందినేని మల్లికార్జున, పురుషోత్తం, రామకృష్ణారెడ్డి, జాహ్నవిరెడ్డి, పెద్ద బాబయ్య, శేషానందరెడ్డి, రాజేష్‌కుమార్‌రెడ్డి, శారద, సుబ్బరాయుడు, లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌గా శ్రీనివాసులు రెండోసారి ఎన్నిక



ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల టిడిపి కన్వీనర్‌గా బోయ గంతి శ్రీనివాసులు వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల ఇన్‌ఛార్జి ధర్మవరపు బాలాజీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో శ్రీనివాసులు విస్తృతంగా పోరాటాలు చేశారన్నారు. దీనికితోడు ప్రస్తుతం అధికార పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టత కోసం విశేష కృషి చేస్తున్నారన్నారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ రెండోసారి అవకాశం కల్పించినట్లు తెలిపారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ టిడిపి చేపడుతున్న సంక్షేమ పథకాలను తీసుకెళ్లి పార్టీ పటిష్టత కోసం పని చేస్తానన్నారు.

జగన్‌కు పార్టీని నడిపే అర్హత ఉందా..?

పోలీస్‌స్టేషన్‌లో టిఎన్‌టియుసి ఫిర్యాదు


సిఐకి ఫిర్యాదు చేస్తున్న టిఎన్‌టియుసి నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్న వైసిపి అధినేత జగన్‌కు పార్టీ అర్హత లేదని టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్ నాయుడు అన్నారు. ఈమేరకు శుక్రవారం తాడిపత్రి రూరల్ సిఐ శివ గంగాధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ఏ నాయకుడూ మాట్లాడని భాష, ఎవరూ సమర్థించని వైఖరిని జగన్ ప్రోత్సహిస్తున్నారంటే ఆయన వ్యవహార శైలి ఎంత విధ్వంసంగా ఉందో అర్థం అవుతుందన్నారు. జగన్ పర్యటనలో ఓ సైకో యువకుడు రఫ్పా రఫ్పా అని పీకలు నరికేస్తామని ప్లకార్డులు ప్రదర్శిస్తే.. ఖండించాల్సింది పోయి, సమర్థించడం బాధాకరమన్నారు. యువతకు మీరిచ్చే సందేశం ఏంటి.. మీ మాటలను చూసి యువకులు చెడిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వెంటనే జగన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, రాష్ట్ర ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హాజీవలి, హనుమాన్ నాయక్, ఖాసీంవలి, తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయి ఓటరు జాబితాకు సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ భాస్కర్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహశీల్దార్ బాస్కర్ కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో పోలింగ్ బూత్ అధికారులకు నాయకులు సహకరించాలని కోరారు. రెండు చోట్ల ఓట్లు నమోదైనా, మరణించిన వారి ఓట్లు తొలగించేందుకు, వివిధ సవరణలు చేయడానికి అందరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డీటీ ఆంజినేయులు, సిపిఎం కమిటీ జిల్లా అధ్యక్షుడు అచ్యుత్‌ప్రసాద్, వైసిపి నాయకులు అమానుల్లా, సిపిఐ నాయకులు గోపాల్, నరసింహులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

చింతకాయమందలో డీఎస్పీ విచారణ


ప్రజలను విచారిస్తున్న డీఎస్పీ, పోలీసులు

యల్లనూరు : మండల పరిధిలోని చింతకాయమంద గ్రామంలో గతవారం చోటు చేసుకున్న ఘర్షణపై డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం విచారణ చేపట్టారు. గతవారంలో చింతకాయమంద గ్రామానికి చెందిన లక్ష్మయ్య, రాజేంద్ర మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘర్షణలో లక్ష్మయ్యను రాజేంద్ర కులం పేరుతో దుషించి చేతిలో ఉన్న బీరు బాటిల్‌తో తీవ్రంగా గాయపరిచాడు. బాధితుని ఫిర్యాదు మేరకు వివరాలను తెలుసుకునేందుకు డీఎస్పీ గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంట సిఐ సత్యబాబు, ఎఎస్ఐ సంపత్, పోలీసులు ఉన్నారు.

ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీకి సన్మానం


ప్రజలను విచారిస్తున్న డీఎస్పీ, పోలీసులు

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, మాజీ సర్పంచ్, వైసిపి సీనియర్ నాయకుడు డి.హుస్సేన్‌పీరాను వైసిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం నాయకులు శుక్రవారం సన్మానం చేశారు. క్రిస్టియన్ మైనార్టీ విభాగం నూతన కమిటీ ఏర్పడిన సందర్భంగా ఛైర్‌పర్సన్ దంపతుల నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా పూలమాలలతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. అలాగే వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్‌రెడ్డిని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వైపి. బాబు, ఉపాధ్యక్షుడు శామ్యూల్, మండల కమిటీ నాయకులు గ్లాస్టన్ ఎస్తేరు, ప్రియాంక, నాగేంద్రబాబు, రామారావు, భార్గవ్, పాస్టర్లు జాకోబ్, సాల్మన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన 'కూటమి'

ఏడాది పాలనపై సిపిఎం బుక్లెట్ విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించడం బాధాకరమని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని జెడ్.వీరారెడ్డి భవనంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై సిపిఎం ముద్రించిన బుక్‌లెట్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. పేదల అవసరాలకు తగ్గట్టుగా కూటమి ప్రభుత్వం పాలన సాగించడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని చెప్పారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏది? అని ప్రశ్నించారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి 16 వేలు మందికే ఉద్యోగాలు వదలడం అన్యాయమన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇస్తామన్న హామీ మరిచారన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు. మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, ఐద్వా నాయకురాలు రేవతి, కవిత, సిఐటియు నాయకులు నారాయణస్వామి, రాము, మున్ని, తదితరులు పాల్గొన్నారు

వైసిపి ఎస్టీ విభాగాన్ని బలోపేతం చేయండి

జిల్లా అధ్యక్షులు అనంత


గజమాలతో సత్కరిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి ఎస్టీ విభాగాన్ని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సాకే మహేష్ శుక్రవారం సాయంత్రం అనంతపురంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజమాలతో సత్కరించారు. అనంతరం అనంత మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సాకే మహేష్‌కు సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళిత, గిరిజనులపై దాడులు అధికమయ్యాయన్నారు. ఇటీవల అనంతపురంలో గిరిజన విద్యార్థిని హత్యకు గురైన విషయాన్ని ప్రస్తావించారు. మతురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు వైసీపీ ఎస్టీ సెల్ తరఫున పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, ఎస్టీ సెల్ నగర ఉపాధ్యక్షుడు సాకే రాజు, వైసీపీ నాయకులు సాకే కొత్తరాయుడు, సాకే గంగయ్య, రసూల్, అఫ్రిది, సాకే మల్లి, గుజ్జల అనిల్, రమేష్, చాందు, నూర్, శశి, జయ, సాకే రవి, కృష్ణ, సాకే రమణ, యువజన విభాగం నగర అధ్యక్షుడు శ్రీనివాసదత్త, మైను, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం : ఎస్ఎఫ్ఐ


జెండాను ఎగురవేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగి శివ పిలుపునిచ్చారు. భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర మహాసభలు జరగనున్న దృష్ట్యా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం బడిలో చెప్పేవే కాకుండా సమాజం గురించి కూడా చదవాలన్నారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ విద్యాహక్కు, ప్రభుత్వ రంగంలో ఉద్యోగ రిజర్వేషన్ కల్పించినప్పటికీ రాష్ట్ర హక్కును కేంద్ర ప్రభుత్వం లాగేసిందన్నారు. ప్రాథమిక విద్యను కూడా కేంద్రం తన ఆధీనంలోకి తెచ్చుకుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలో వేలాది ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలను మూసివేసేందుకు రంగం సిద్ధమైందన్నారు. విద్య ప్రయివేటీకరణతో రాజ్యాంగ ప్రాథమిక హక్కును ఉల్లంఘించినట్లు అవుతుందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని, రాష్ట్ర హక్కులు, ప్రజాతంత్ర రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వలి, కిరణ్, గణేష్, అనిల్, చరణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కోర్స్ బోధించేందుకు అర్హులైన వారు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక కణేకల్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కోర్స్ బోధించేందుకు పోస్టు ఖాళీగా ఉందన్నారు. బిఇ/బిటెక్, ఎఎంఐఇ సివిల్ ఇంజినీర్ విద్యార్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 23వ తేదీ సోమవారం సాయంత్రంలోపు దరఖాస్తును కళాశాల ఆఫీసులో అందజేయాలని కోరారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలకు డిమాండ్

ఉరవకొండ : నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వైసిపి విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు సాకే పురుషోత్తం డిమాండ్ చేశారు. శుక్రవారం వైసిపి విద్యార్థి విభాగం, జివిఎస్ఎస్ ఆధ్వర్యంలో మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఈశ్వరప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జివిఎస్ఎస్ మండల అధ్యక్షులు ఎరుకల మహేంద్ర, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు షేక్ ఇర్ఫాన్, శివరాజ్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు

ఉరవకొండ : తాగునీటి కోసం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో శుక్రవారం నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భూదగవి గ్రామ టిడిపి నాయకులు మాట్లాడుతూ గ్రామంలో గత కొన్నేళ్లుగా తీవ్రమైన తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. సమస్యలను పయ్యావుల సోదరుల దృష్టికి తీసుకెళ్లడంతో రూ.2.50లక్షలతో సుంకలమ్మ దేవస్థానం నుంచి బీసీ కాలనీ వరకూ పైప్‌లైన్ వేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీరాములు, టిడిపి నాయకులు చిరంజీవి, భీమన్న, చక్రి, అఖిల్, తిమ్మప్ప, హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయుడికి సన్మానం

యాడికి : ఉద్యోగ విరమణ చేస్తున్న మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కోన రాజారెడ్డిని శుక్రవారం పాఠశాల సిబ్బంది, స్నేహితులు, బంధువులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు కాసెప్ప, ధనలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు, విశ్రాంత హెడ్మాస్టర్ భాస్కర్‌రెడ్డి, విజయమ్మ, పాఠశాల సిబ్బంది వై.శ్రీనివాస్‌యాదవ్, విశ్వనాథ్, రవికుమార్, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.


దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న వైసిపి నాయకులు

కార్మికుల దీక్షలకు వైసిపి సంఘీభావం

గుంతకల్లు : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట జెఎసి ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు వైసిపి నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో వైసిపి నియోజకవర్గ యువ నాయకులు ఎన్.గాదిలింగేశ్వర బాబు (చిన్నబాబు), జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షులు బి.సుంకప్ప, 3వవార్డు ఇన్‌ఛార్జి శేఖర్, నాగసముద్రం సర్పంచు నరసింహులు, నక్కనదొడ్డి ఎంపిటిసి జింకల రామాంజనేయులు, వైసిపి పట్టణ వైస్ ప్రెసిడెంట్ హనుమేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షులు మల్లేష్, నాయకులు టిజి సురేష్, సాయిపోగు సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


బొమ్మనహాళ్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని డాక్టర్ శ్రీలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ వేడి వేడి ఆహారాన్నే తీసుకోవాలన్నారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఈశ్వరయ్య, యుగంధర్, ఆశావర్కర్లు, నర్సులు పాల్గొన్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి హుండీ లెక్కింపు

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి దేవస్థానం హుండీని గ్రామస్తుల సమక్షంలో దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.16,53,672 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ తెలిపారు.

బ్యాంకుల వద్ద మహిళల బారులు

'తల్లికి వందనం' డబ్బుల డ్రా కోసం క్యూ


పోస్టాఫీస్ వద్ద బారులుదీరిన మహిళలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన తల్లికివందనం డబ్బుల కోసం పోస్టాఫీసు, బ్యాంకుల వద్ద మహిళలు బారులు తీరుతున్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.13వేల చొప్పున కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికీ తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ చేసిన విషయం తెలిసిందే. ఈ పథకానికి సంబంధించిన డబ్బులు పడకముందే చాలామంది మహిళలు స్థానిక ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు, సేవింగ్స్ ఖాతాలను పోస్టాఫీస్‌లో ప్రారంభించారు. దీంతో తల్లికివందనం డబ్బులు చాలామంది మహిళలకు పోస్టాఫీసులోనే జమ అయింది. దీంతో ఎప్పుడూ ఖాళీగా ఉండే పోస్టాఫీసు మహిళలతో కిటకిటలాడుతోంది. ఇప్పటి వరకూ రూ.60లక్షలకు పైగా నగదు లబ్ధిదారులకు చెల్లించినట్లు ఇన్‌ఛార్జి పోస్టుమాస్టర్ మల్లేష్ తెలిపారు.

ఆర్యన్ షూటింగ్ అకాడమీలో శాప్ డైరెక్టర్ బొమ్మినేని


ఆర్యన్ నిర్వాహకులు, క్రీడాకారులతో బొమ్మినేని శివ

అనంతపురం : నగరంలోని శ్రీనగర్‌కాలనీ నీరు-ప్రగతి పార్క్ వద్ద ఉన్న ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీని నూతన శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనంతపురం లాంటి వెనుకబడిన జిల్లాలో క్రీడలకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు అత్యున్నత స్థాయిలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యన్ షూటింగ్ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీకాంత్, స్కేటింగ్ కోచ్ నాగేంద్ర, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా ఆదినారాయణ



శింగనమల : రాప్తాడు నియోజకవర్గ టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తన నియామకానికి సహకరించిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు యాదవ్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

యల్లనూరు తహశీల్దార్‌గా బి.రాము



యల్లనూరు : మండల తహశీల్దార్‌గా బి.రాము శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇక్కడే ఉప తహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఈనేపథ్యంలో తహశీల్దార్‌గా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటానని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా విజిత

యల్లనూరు : మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా విజిత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బత్తలపల్లిలో విధులు నిర్వహించిన విజిత బదిలీపై యల్లనూరుకు వచ్చిన బాధ్యతలు స్వీకరించారు.

కంబదూరు మండల సర్వసభ్య సమావేశం

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి కురుబ లక్ష్మీదేవి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా గత సమావేశంలో చర్చించిన సమస్యలపై పరిష్కారం చూపకపోవడంతో పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. అనంతరం తాగునీరు, విద్య, వైద్యం, రవాణా, రోడ్లు, తదితర 20 అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలకిషన్, ఎంపిడిఒ సూర్యనారాయణ, వైస్ ఎంపిపి సోముశేఖర్, ఎంపిటిసిలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తెలిపిన వివరాల మేరకు.. గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన చిట్టిబోతుల రామాంజనేయులు గత కొన్నేళ్లుగా కుటుంబ సమస్యలతో బాధ పడుతుండేవాడు. భార్య సుజాతతో విడాకులు తీసుకుని మూడేళ్ల నుంచి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో గురువారం రాత్రి తల్లిదండ్రులతో గొడవపడి వెళ్లాడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం చనిపోతున్నానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. తల్లిదండ్రులు సమీప బంధువుల సాయంతో గ్రామ సమీపంలోని పలు ప్రాంతాల్లో గాలించారు. అర్ధరాత్రి వరకు వెతికిన రామాంజనేయులు జాడ తెలియలేదు. అయితే శుక్రవారం ఉదయం జక్కలచెరువు గ్రామ సమీపంలో రైలు కింద పడి మరణించి శవమై తేలాడు. స్థానికులు, రైల్వే కార్మికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్ద లభించిన ఆధారాలను గుర్తించి తండ్రి తిప్పన్నకు సమాచారం అందించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలిక అదృశ్యం

బెలుగుప్ప : మండల పరిధిలోని కోనంపల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక గురువారం నుంచి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు ఎస్ఐ రామదాసు తెలిపారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నగదు చోరీ

బెలుగుప్ప : మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో రూ.2.46లక్షల నగదు, బంగారు నెక్లెస్, వెండి పట్టీలు చోరీకి గురైనట్లు ఎస్ఐ రామదాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నరసాపురం గ్రామంలో గురువారం రాత్రి 9 గంటల సమయంలో తిమ్మారెడ్డి ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి బీరువాను పగలగొట్టి రూ.2.46లక్షల నగదు, బంగారు నెక్లెస్, వెండి పట్టీలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈమేరకు ఇంటి యజమాని తిమ్మారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినటఉల ఎస్ఐ తెలిపారు.

గడ్డివామి దగ్ధం


నిప్పును ఆర్పుతున్న స్థానికులు

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని పసలూరు గ్రామంలో శనివారం గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తలారి లక్ష్మీదేవి, దుబ్బా పోతలయ్యకు పశువులు ఉండటంతో రెండు ట్రాక్టర్ల వరిగడ్డిని రూ.40 వేలకు కొని వామిగా ఏర్పాటు చేసుకున్నాడు. ఈనేపథ్యంలో గడ్డికి నిప్పంటుకుని దగ్ధమైనట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ఇద్దరు దొంగలు అరెస్టు

రూ.9లక్షల విలువజేసే బంగారు నగలు స్వాధీనం


నిందితుల వివరాలను తెలియజేస్తున్న సిఐ శేఖర్

ప్రజాశక్తి-అనంతపురం

బంగారు నగలను ఎత్తుకెళ్లే ఇద్దరు దొంగలను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.9 లక్షలు విలువజేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిఐ శేఖర్ వెల్లడించారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన చిన్న బాబు, గుంతకల్లు మండలం దోసలుడికి గ్రామానికి చెందిన అరికిచెర్ల రామ్ మోహన్‌లు జల్సాలకు వెళ్లి అప్పులపాలై దొంగలుగా మారారు. తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. ఇలా అనంతపురంతో పాటు పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేశారు. వీరిపై నిఘా ఉంచగా పక్కాగా అందిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం నిందితులు ఇద్దరిని కళ్యాణదుర్గం - అనంతపురం రోడ్, సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద అరెస్టు చేశారు. వీరి నుంచి 9 లక్షలు విలువజేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన అనంతపురం రూరల్ పోలీసులను ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

ప్రజాసేవలో రెవెన్యూ ఉద్యోగులే కీలకం

ప్రజాశక్తి-గుంతకల్ రూరల్

సమస్త ప్రజాసేవల్లో రెవెన్యూ శాఖ చాలా కీలకమని ఆర్‌డిఒ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో భక్త రామదాసు కూడా తహశీల్దార్‌గా పని చేసిన చరిత్ర ఉందన్నారు. అలాంటి మహోవ్యక్తిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, డిటి నారాయణస్వామి, సిఎస్‌డిటి సుబ్బలక్ష్మి, ఆర్‌ఐలు, వీఆర్వోలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డీటీ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్రాంత విఆర్‌ఒలను ఘనంగా సత్కరించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి రాజా, ఆర్‌ఐ మదన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నారాయణమ్మ, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ బ్రహ్మానంద, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : పాలనలో రెవెన్యూ శాఖ పాత్ర ఎంతో కీలకమని విశ్రాంత ఆర్‌డిఒ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ భాస్కర్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం నిబద్ధతతో పని చేస్తామని రెవెన్యూ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.

రెవెన్యూ దినోత్సవంలో వక్తలు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా థామస్ మన్రో, రామదాసు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వసంతబాబు, మండల స్పెషల్ అధికారి విశ్వనాథరెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ రామప్రసాద్, టిడిపి నాయకులు మల్లికార్జున, పెద్దతిప్పయ్య, ఆర్‌ఐ నగేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు ఈశ్వర్‌రెడ్డి, రమేష్‌స్వామి, ఎర్రిస్వామి, చంద్రశేఖర్, రాజశేఖర్, నగేష్ బాబు, ఎర్రిస్వామి, మధుసూదన్, వెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్రాంత తహశీల్దార్ తానికింటి ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలాజీరాజ్, డిప్యూటీ తహశీల్దార్ శ్వేత, వీఆర్వోలు ప్రసాద్, సుంకన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వీఆర్వోల సంఘం జిల్లా నాయకుడు యుగంధర్, మండల నాయకులు సుజాతతోపాటు రామన్న, శృతి, కుళాయిస్వామి, సురేంద్రను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు సంఘం అధ్యక్షులు మారుతి, చంద్రహాస్, దుర్గేష్, నాగేంద్ర, నాగరాజు, రామకృష్ణ, వన్నూరుస్వామి, కీర్తి, అరుణ, డీలర్ల సంఘం అధ్యక్షులు మోహన్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు మల్లికార్జున, మాజీ జడ్పిటిసి జగన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గంలో ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

శింగనమల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు రెవెన్యూ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, సిఎస్‌డిటి చంద్రకళ, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామి, ఆర్‌ఐ సూర్యప్రతాప్, సీనియర్ అసిస్టెంట్ నాగభూషణం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఓబుళాపురం గ్రామానికి చెందిన విశ్రాంత విఆర్‌ఒ పుల్లారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కిష్టప్ప, మండల సర్వేయర్ శేషుసాయి, వీఆర్వోలు నాయుడు శ్రవణ్, భీమేశ్వర్‌రెడ్డి, మౌలాలి, విఆర్‌ఎలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న గుంతకల్ ఆర్‌డిఒ శ్రీనివాసులు


అనాథ పిల్లలకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

అనాథపిల్లలకు ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణంలోని 15వవార్డులో తల్లిదండ్రులను కోల్పోయి అనాథ పిల్లలుగా మిగిలిన చిన్నారులకు అక్కమాంబ ఆలయ కమిటీ ఛైర్మన్ పద్మావతి శుక్రవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే సురేంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇఒ దేవదాస్, టిడిపి నాయకులు తలారి సత్తి, నాగప్ప, నారాయణ, కుణే సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్లను సద్వినియోగం చేసుకోండి

ఉరవకొండ : రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకానుక కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సర్పంచు మల్లెల జగదీష్ సూచించారు. శుక్రవారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మేక నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రహంతుల్లా, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత సర్పంచికి అవమానం బాధాకరం


ఉరవకొండ : కర్నూలు జిల్లా ఆదోని మండలం ధానాపురం గ్రామంలో నిర్వహించిన కూటమి ప్రభుత్వ సంవత్సర పాలనకు సంబంధించిన సంబరాల్లో దళిత సర్పంచు చంద్రశేఖర్‌ను అవమానించడం బాధాకరమని చాబాల సర్పంచు మల్లెల జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. వేదికపై (కట్ట) 'దళితుడు కాబట్టి రాదులే' అని సంబోధిస్తూ సభ నిర్వహించిన బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపినాయకులు గుడిసె కృష్ణమ్మపై ఎస్టీ, ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపి మండల, గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా టిడిపి మండల గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నికలు సజావుగా జరిగినట్లు మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు నాగరాజు, ఓబులేసు తెలిపారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలు మేరకు మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ఎన్నికలు నిర్వహించారు. కొన్నిచోట్ల ఏకగ్రీవంగా, మరికొన్నిచోట్ల ఓటు బ్యాంకింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల ముఖ్య నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

శింగనమల : నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ శేషారెడ్డిని టిడిపి నాయకులు శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, నాయకులు కొయ్యగూర పెద్దన్న, చంద్రాయుడు, మొండిపోగుల ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

రాయదుర్గం : గర్భిణులు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని శాంతినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అజార్‌ఖాన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణ పరిధిలోని గౌడ లేఅవుట్‌లో ఉన్న 1వ సచివాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమకాటు వల్ల వచ్చే మలేరియా గర్భవతిలో గర్భాశయం పెరుగుదల లేకపోవడం, అకాల ప్రసవం, తక్కువ బరువు కలిగి ఉన్న బిడ్డ జన్మన్విడం, అబార్షన్ కావడం వంటివి అవుతాయన్నారు. కావున గర్భిణులు దోమకాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మీనరసమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ఎర్రిస్వామి, సూర్యనారాయణ, రవి, రాజు, ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సురేంద్రబాబును కలిసిన సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కళ్యాణదుర్గం రూరల్ : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును శుక్రవారం స్థానిక ప్రజావేదిక కార్యాలయంలో నియోజకవర్గ సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సైనిక్ వెల్ఫేర్ సభ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సేకూరి అమరనాథ్, వైస్ ప్రెసిడెంట్ దత్తయ్య, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, సభ్యులు శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

విత్తనకాయలను సద్వినియోగం చేసుకోండి


రికార్డులను పరిశీలిస్తున్న ఉమామహేశ్వరమ్మ

రాప్తాడు : ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న విత్తన వేరుశనగ కాయలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు రైతు సేవాకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విత్తన వేరుశెనగ కాయలను సాగు చేసి లాభాలు గడించాలన్నారు. కాగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఇకెవైసి పెండింగ్ ఉన్న వారు వెంటనే చేయించుకోవాలని సూచించారు. రైతులకు ఏ విధమైన సాంకేతి సలహాలు అవసరమైనా వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణచైతన్య, ఎఇఒ రంజిత, విఎఎ శ్రీనివాసులు, విహెచ్ఎ సోనియా, మరూరు విహెచ్ఎ హర్షవర్ధన్, రైతులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుత్తి డిప్యూటీ ఇన్‌ఛార్జి విద్యైఇఒ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుల సేవలు మరువలేవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటప్రసాద్, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మహమ్మద్‌రఫీ, పిఇటి రాజశేఖర్, ఇమాంసాబ్, ఉమాశంకర్, రాజేశ్వరి, రేష్మా, భాను శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామ్మూర్తి, రమేష్‌నాయక్, శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, వనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం